కథానిక

# నా సైకిలుస్వారీ గాథ

వల్లూరి వసంతరావు

నిజానికి సైకిలుమీద స్వారీచేయడం ఎంత సరదాగా వుంటుంది! ఎంత ముద్దు ముచ్చటగా వుంటుంది! అబ్బ! సైకిలుఎక్కి సంయ్యిమని ఎవరైనా పోతూవుంటే నాలో నేనే ఎంత కుమిలిపోతానో ఆ భగవంతునికే యెరుక. అన్నీ వ్రాసిపెట్టాడుగాని ఈ సైకిలుస్వారీయే మినహాయించి పారేశాడు నా నొసటను బ్రహ్మదేవుడు.

అరే! అయిదేళ్ళ కుర్రకుంకకూడా బుడుగూ బుడుగూ తొక్కుకుపోతున్నాడే సైకిలు! చిన్నాళ్ళే కాదు, పెద్దలేకాదు, తలనెరసినవాళ్ళేకాదు, చదువుకున్నవాళ్ళేకాదు, చదువురాని చవటలేకాదు, అరె! పల్లెటూరి గబ్బిలాయిలేకాదు, ఒంటికాలు దద్దమ్మలుకూడా తొక్కిపారేస్తూవుంటే ఇక ఏమని చెప్పను నా అవస్థ? నిజంగా ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులూ ప్రాకి గంగవెర్రులెత్తుతున్నాయంటే నమ్మండి. లేకపోతే యింత చదువూ చదివి యింతపేరూ తెచ్చుకొని, యింత సంపాదిస్తూవుండీన్నీ యీపాటి సైకిలు తొక్కలేకపోవడమా? ఛీ, ఛీ, చిన్నతనంకాదూ? సాధించాలి, తప్పకుండా సాధించితీరాలి. లేకపోతే చచ్చినంత పరువు నష్టంకూడానూ.

అసలు చిన్నతనంలోనే క్రిందపడో, మీదపడో నేర్చుకునేవాణ్ణే. అబ్బే! మా అమ్మ నన్ను ఓ అరనిమిషమన్నా వదిలిపెట్టితేగా? ఎక్కడ సైకిలు ఎక్కుతానో, ఎక్కడ కాళ్ళూచేతులూ విరగ్గొట్టుకుంటానో ఎక్కడ పెళ్లిపెడాకులవ్వో అని ఒక్కటేసాధిం పు. సాధింపేకాదు రోజుకు 24 గంటలు ఘుట్టి నిఘాపరిచేసేది. అప్పుడే నేర్చుకొనియుంటే యిప్పుడీ మనోవ్యథ వుండేదామరి? అందుకే స్వాతంత్ర్యం, స్వేచ్ఛావుండాలంటారు. తెల్లాళ్ళని చూడండి. తమపిల్లల్ని చిన్నప్పుడేతీసుకువెళ్ళి తిన్నగా నడికాల్వలో పారేస్తారట. చచ్చినట్లు ఒడ్డుకి కొట్టుకుంటూవస్తాడు కుర్రాడు. దెబ్బతో వచ్చిపడుతుంది యీత. ఇక మనవాళ్ళువున్నారు. నీట్లోగుడ్డయిరి వీధిల్లోకే వెళ్ళనివ్వరుకదాఖర్మం పదేళ్ళువంటిమీద పడ్డాకూడాను. అందుకే తెల్లవాళ్ళంత ఫార్వర్డుగా సంయమని ముందుకు పోతూవుంటే మనం బేక్వర్డుగా బ్రేకువేసుకుంటూ కూర్చున్నాం గొంగళిపురుగుల్లా.

అంచేతను ఏమైనాసరే ససేమిరా సైకిలుని సాధించాలి. సాధించితీరాలి అనిఓభీష్మప్రతిజ్ఞ పట్టివేశాను. అసలు యీ సైకిలు ఏమంతబ్రహ్మాండమూఅంట? ఒక్కదూకులోఎగిరి సైకిలు ఈసీటుమీదపట్టమూ, ఆపళాన్ని గిరగిరా తొక్కిపారేయడమూ, రంయమని దూసుకుపోడమేగా యీ ద్విచక్రవాహనపు అసలు కిటుకంతానూ? శరవేగంతో అలాపోతూవుంటే మానవమాత్రులుగానీ, వాహన వగైరాదులుగాని అడ్డంగాని ఎదురైవస్తే శంఖారవంల్లా ఘంటను ఘణఘణ మ్రోగించి పారేసేప్పటికి ఎక్కడివక్కడే యిరుక్కుపోయి ఫైరింజన్ కిచ్చినట్లు రహదారి అంతా నాపరంగావించి వేయక్పోదే దెబ్బతో. ఇంతే గదటయ్యా ఈ సైకిలు అసలు రహస్యమంతానూ? ఏమైనా సరే సైకిలునేర్చుకొని తీరాలి.

ఐతే గురువుని ఎవర్ని ఎన్నుకునేది? అన్నట్టు, మన ప్రక్కవీధిలో ఓ నల్లటి శాండో వుండాలి. భీముడు కాబోలు అంటారు వెళ్ళి ఆయన్నిగాని గురువుగా ఎన్నుకున్నానా నా రక్తం కళ్ళబడక్కర్లేకండా సైకిలు వచ్చేసిందన్న మాటే.

అందుకనే తిన్నగా ఆయన ఇంటికే వెళ్లాను. అవసరం కొద్దీ "భీమసేనులుంగారూ!" అనే పిల్చాను, దభాలున తలుపు తెరవబడింది. అథాటుగా ఆ విగ్రహాన్ని చూశానేమో గుభాలున గుండె కొట్టుకొని ఠపీమని ఆగిపోయినట్లయింది. అచ్చంగా హిడింబాసురుణ్ణి తలదన్ని పుట్టాడా అన్నట్టుందా విగ్రహం. పోనీ ఎలాగుంటేనేం? గురువుకదా. తప్పదు. చేతులు జోడించి 'నమస్తే' అన్నాను.

"ఏంపనీ?" కొట్టవచ్చేలా చిన్న వురుము వురిమాడు.

వినయ విధేయతలుగల వెనకటి విద్యార్థిలానే అన్నాను "దయయుంచి తమరు నాకు సైకిలు నేర్పాలి. అందులో తమరు అఖండులని విన్నాను" ఏమంటాడా అని ఎదురుచూస్తున్నా.

"అచ్ఛా! తప్పకుండా నేర్పుతా. అయిదు రోజుల్లో నేర్పేసి పదిరూపాయలు తీసుకుంటా" అన్నాడు బేరగాడి పోజుపెట్టి.

"అరే, పదిరూపాయలే! అయిదురోజులకీ పది రూపాయలా! రోజుకి అంటే 2 గంటలకీ 2 రూపాయలా? బలే బాగుంది బేరం. అయితే నేనూ ఓ కాలేజీ పెట్టి ఓ యాభైమందికి నేర్పుతాను సైకిలు. దానితో వందలకు వందలు వచ్చిపడతాయి వారంవారం. వెధవ వందరూపాయల నౌకరీకి ఈవేళే రిజైన్ యిచ్చి పారేస్తా" ఇదంతా ఏమాత్రం బయటకు పొక్కని విధానంలో మనస్సులోనే చర్చించుకొని కడకు దిట్టబరచుకొని భీమసేనులతో అనేశా "సరే ఇస్తా నేర్పండి"

"ముందే యిచ్చేయాలి" అన్నాడు నిక్కచ్చిగా. ఆయన ముఖ వర్చస్సు చూస్తే తప్పదట్లే తోచింది. పదిరూపాయలూ ఆయన చేతిలో గ్రుమ్మరించాను. అన్నాను "గురూజీ! రేపు తెల్లారందే వచ్చేస్తారు కదూ? హంగామా లన్నిటితో సిద్ధంగానే వున్నాను. పాతబట్టలు అట్టే పెట్టాను. దెబ్బలు గాని తగిలితే మిగిలితే వుంటుంది కదా అని సైబాల్ డబ్బాకూడా తెప్పించుకున్నాను. సైకిలు షాపులో ఓమంచి సైకిల్ని రిజర్వ్ చేయించి వుంచాను. అన్నట్టు మనకి కార్యరంగం ఊరి చివరి ఇసుకమైదానం బాగుంటుంది. పడినా దెబ్బ అట్టే తగలదు ఒకటీ, ఎవ్వరూ చూడరు రెండూ, ఆఁ! బాగున్నాయండీ గురూ?"

"ఆ, అలానే రేపు ఉదయాన్నే వచ్చేస్తాను" అన్నారు. అప్పటికి ప్రైమ్ మినిస్టరుగారితో ఇంటర్వ్యూ చేసినంత వుబ్బిపోయి ఇల్లు చేరాను.

ఆరాత్రి ప్రక్కమీదనే పడుకున్నానుగాని మనస్సు మాత్రం స్వాధీనం తప్పిపోయింది. బొంది పక్కమీదా చిత్తం సైకిలుమీదను, ఎలానో కాస్త కన్ను మూయగల్గాను అర్థరాత్రికి. అదో సరికొత్త సైకిల్. దానినిండా పూలమాలలు, చెండులూను. ఒక్క వురుకున సీటు నలంకరించాను. శరవేగంలో బయలుదేరింది. దారిలో మా యింటివాళ్ళంతా ఎదురయ్యారు బండిలో. నిజంగా సుమండీ నన్ను నమ్మలేకపోయారు. కళ్ళు నలుపుకుని మరీ చూశారు. అబ్బే! వెనకటి వెర్రిపుల్లాయినామరి. సైకిలు స్వారీలో నున్న నేను దివినుండి దిగివచ్చిన దేవతామూర్తినే అనుకున్నారు సుమండీ. అరే నా సైకిలు అంతరిక్షంలో ఎగిరిపోతుందే! ఇంకాపోతోంది! యింకా పోతోంది. అదిగో, అదేదో లోకంలా వుంది. ఆఁ, చదివా, భారతం ఆఖరు ఘట్టంలో ధర్మరాజు కుక్కతో సహా ఇక్కడికే వచ్చాట్ట. ఇదే స్వర్గలోకం. ఆహాహా! ఈనాటికి నేను సైకిలులో రాగలిగాను. అబ్బ, చచ్చానోయ్ నెత్తిమీద పిడుగులా గుద్దారు. దేవుడా, పడ్డాను. అమాంతం కిందపడ్డాను. చచ్చానా? యింకా చావలేదా?

కళ్ళు తెరిచాను. అరే, చావలేదే! ఇది నా యిల్లేనే! పరుపుమీదనే వున్నానే! ఆరినీ ఇంతా చేసి యిదంతా కలేనా? తెల్లారింది. గబగబా లేచి పాతబటలు వేసుకున్నాను. సైబాల్ డబ్బా తీసుకున్నా. సైకిల్ తెచ్చుకునేసరికి గురువుగారు రానే వచ్చారు. "ఓం-విఘ్నేశ్వరుడా!" అంటూ సైకిలుకి ఓ కొబ్బరికాయ కొట్టి అడుగు ముందుకు వేశాను. అడుగు వేశానోలేదో బెదురుచక్కా వచ్చింది. గుండె నిలువునా నీరు గారిపోయింది. ఛా, ఇది వీగ ధర్మంకాదని మనస్సు దిటపరచుకొని రెండవ అడుగువేశాను. కుర్రవెధవ "తుప్" మని తుమ్మాడు. అమాంతంగా యీ సైకిలు యెత్తి వాడి ముఖాన కొడదామనిపించింది. వెధవ చస్తాడు కుర్రకుంక అని ఆగాను. "విఘ్నేశ్వరా నీవేదిక్కు"ని ముందుకు నడిచా.

అరే, అందరూనన్ను చూచి నవ్వుతున్నారే! ఏం? నేను నేర్చుకోకూడదూ సైకిలు? వాళ్ళేమిటి పెద్దపొడిచేచేవాళ్ళు. అబ్బే, నా బట్టల్ని చూచి నవ్వుతున్నట్లుందే? అయినా ఏమా అని ఒక పర్యాయం నా బట్టలు చూచుకున్నాను. అయ్యో! నా ప్రారబ్ధం గాలిపోనూ, షర్టూ పేంటూ కూడా తిరగేసి పైగా ముందుది వెనక్కి తొడిగేశానే! అందుకే అందరూ నవ్వుతున్నారన్నమాట. ఛీ! ఆదిలోనే హంసపాదురా ఆదిదేవుడా అనుకొని గురువుగార్ని రేపురమ్మని ఒక్కవుడాయింపుతో యింటికి వచ్చిపడ్డాను.

ఈవిధంగా నా పంచదిన ప్రణాళికలో ప్రథమ దివసం పాసయిపోయింది. ద్వితీయదినం వచ్చిపడింది. అన్ని హంగులతోనూ విఘ్నేశ్వరస్మరణ చేసుకొని మరీబయలుదేరాను కార్యరంగానికి హరీఓం అంటు ఎదురయ్యాడు పొరుగింటి శాస్త్రుల్లు లుబ్ధావధాన్లుగారు. అసలే వంటి బ్రాహ్మడివంకర శకునంగా సగంచస్తుంటే పైగా ఓ బ్రహ్మాస్త్రం నామీద విసిరాడు ముండావాడు "ఎక్కడకు" బయలుదేరేవయ్యా, అంటూ. ఇక అరికాలు మంట నడినెత్తి కెక్కింది. ఆవేశా "తిన్నగా నరకానికి పోతున్నా ఇద్దరికి జాగావుందట వస్తారా?" అని.

బిక్కమొగంపెట్టి అన్నారు 'అదేమిటయ్యా అలాకోపడతావ్? వట్టినే ఎక్కడకి వెళ్లుతున్నావూ అంటేనూ?'

ఉట్టినే అంటే అది వూరుకుంటుందా? చచ్చేదాకా సైతానులా పట్టుకుంటుంది మరి. ఎప్పుడూ ఎవ్వరినీ 'ఎక్కడ' కని అడక్కండి వాళ్లపనులన్నీ పాసుపాసయిపోతాయి. ఎన్నిసార్లు చెప్పాను? ఏం? ఎక్కడుకని అడక్కపోతే మీసొమ్ము ఏంపోయింది? అయినా అడగాలా? రెండుకళ్ళూ శుభ్రంగా వున్నాయికదా, కనపట్టంలేదూ? యీ పాతబట్టలూ. సైకిలూ— గురువుగారూ అహంగామాలన్నీ సైకిలు నేర్చుకునేందుకనీ? అయినా వసనోరు వట్టిసే వూరుకుంటుందా? అడిగేశారు, అధ్వాన్నంచేసి పారేశారు నా అద్వితీయ ప్రణాళికనంతాను.

అంతలో గురువుగారు కాఫీతాగి వస్తానని సైకిలు నన్ను పట్టుకొనమన్నారు. పట్టుకునే సందట్లో లుద్ధావదాన్లు చక్కాపోయారు. లేకపోతే అసలు బాండు వాయించుకుందా మనుకున్నా మళ్ళీ ఎప్పుడూ ఎవ్వరినీ 'ఎక్కడకు' అని అడక్కుండాను.

సరే దాటిపోయినవారు ఎలానూ పోయారు కదా అని యిక సైకిల్ని నఖశిఖ పర్యంతం చూడ్డం మొదలెట్టాను. సరదాపుట్టి రెండుగజాలు నడిపించాను. వున్నట్టుండి మీదకు తిరిగిపోతోంది. అరే. అరే, చూడబోతే పుల్లముక్కల్లాగుండే సైకిలు పులిలామీదపడి పోతోందే? కొంపదీసి ఇదంతా లుబ్ధావదాన్లుగారి 'ఎక్కడికి' ప్రభావం కాబోలురా భగవంతుడా! అరే యిదేమిటి మీదమీదికివరిగిపోతోంది. బ్రేకులు నొక్కుదామనుకునే అంతలో దిక్కుమాలిన ఫెడేలు ఏగళ్ళకు తగిలి ఎల్లకిలాపడ్డాను. అమాంతంవచ్చి కొండపడ్డట్టు సైకిలు నాగుండెమీద పడింది. హారేరామ. హరేకృష్ణ, అని ముమ్మారు స్మరించుకున్నా ఏదెట్టువచ్చినా స్వర్గప్రాప్తి అయినా అవగలదని.

అంతలో గురువుగారువచ్చి సైకిలు లేవనెత్తారు. ఏభైమంది పోగుపడ్డారు. ఓ మహాశయుడు నన్ను లేవనెత్తి అరికాళ్లు తొక్కిపెట్టి సాగదీస్తున్నాడు ఎక్కడ కాళ్లు పడిపోయాయో అని. మరో మహాశయుడు నాచిల్లుజోబిలోంచి కనపడుతున్న ఒకడబ్బాతీసి పూయటం మొదలెట్టాడు దెబ్బలకి. మరో మహాశయుడు "కాళ్ళు విరిగాయేమో వద్దూరు పంపించండి అర్జంటుగా" అని నాకు ఒక్కసారిగా ఏడుపు, నవ్వు, సిగ్గూ పౌరుషం, వుడుకూ, మంటా అన్నీ వరసనవచ్చిపడ్డాయి. ఇంతలో గురువుగారు సైకిల్ని చూపిస్తూ "హేండిలు యిరిగిపోయింద"న్నారు. మొదట్నుంచీ అనుకుంటూనే వున్నా ఇదంతా ఆ "ఎక్కడకు" ప్రభావమేరా బాబూ అని.

అలా ద్వితీయ దినంకూడా పాడయిపోటమే కాక ప్రాణంమీద కూడావచ్చిపడింది. కుంటుకుంటూ యిల్లుజేరా. సైకిలు షాపువాడు బిల్లు 10 రూపాయలన్నాడు.

అయితే ఎన్ని మేరుపర్వతాల్లాంటి అడ్డదిడ్డాలు ఏకమై ఎదురునిల్చినా నాధైర్యసాహసాలు మరిచూడండి. మిగత మూడురోజుల్లోనూ, క్రిందపడీ, మీదపడీ, లేస్తూతూలుతూ, చచ్చేలా దెబ్బలు తగిలించుకుంటూ జాంబక్ రాసుకుంటూ ఎలానయితే మొత్తంమ్మీద సైకిల్ని సాధించాను సుమండీ! ఏమిటనుకున్నారు నాతడఖా, నాపంచదిన ప్రణాళికా తడఖామూ?

ఆహా! బెర్లిన్ జయించాను. కాని యింకా ఎక్కడం, దిగడం చాతకాలే. ఇంత సాధించాక యీ వీరుడు యిది కాస్తా సాధించలేడూ? సాధించి తీరుతాడు, సాధించి సైకిలు ట్రెయినింగ్ కాలేజీపెట్టి వేలు సంపాయిస్తాడు కూడానూ.

గురువుగారు అమాంతంగా ఎత్తి సైకిలు మీద కుదేసి "ఓ, వచ్చేసిందయ్యా సైకిలూ" అంటూ ఒక్క విసురువిసరాడు. నలభైమైళ్ళ

స్పీడులో ముందు కురికింది సైకిలు. ఇక నేను సత్వరంగా తొక్కి పారేస్తున్నా. బజారు రోడ్డు మీద నేపోనిస్తున్నా. నన్ను చూచి, నా సైకిల్ని చూచి జనం ఫైరింజన్‌కి ఝడిసినట్టు ప్రక్కలకి పరుగులు తీసేస్తూవుంటే నీసంతోషానికి పట్టపగాలంటూ వుంటాయా మరి? మరీజోరుగా తొక్కేస్తునా. అంతలో మహాఘోరం జరిగింది. హిమాలయమంత గడ్డిబండి రోడ్డునంతా ఆక్రమించుకొనివచ్చి పడుతోంది ఎదురుగా. బొబ్బలెట్టాను కొత్తవాళ్లని. మొండివెధవ పల్లెటూరి గబ్బిలాయిలావున్నాడు—తప్పించలేదు. అరే, అరే నాసైకిలు తిప్పుదామన్నా ప్రక్కకి తిరగటం లేదు, బ్రేకులు చేతికి అందటమేలేదు. పోనీ బండి అయినా ఆగటంలేదురా భగవాన్! ముచ్చెమటలు పోసేసాయి. అయ్యో, అయ్యో కెవ్వుమని ఒక్కకేక వేశాను. బండి ఆకులు రివ్వున తిరిగాయ్.

నెమ్మదిగా కళ్ళు తెరిచా. ఏదీ గడ్డిబండి? ఏదీ నా సైకిలు? ఎక్కడ? ఎక్కడ?—"అయ్యో, గట్టిగా అరవకండి. బలమైన గాయాలు తగిలాయి. కదలకుండా యీ పాలు తీసుకొని విశ్రాంతి తీసుకోండి. అలా కంగారు పడిపోతున్నారేం? ఫర్వాలేదు నయం ప్రాణం నిలబడింది. గండం గడిచింది. సైకిలు పప్పు అయినా ప్రాణంతో బయటపడ్డందుకు సంతోషించండి."

డాక్టరుగారి యీ మాటలు విన్నాక తెలిసి వచ్చింది నా నిజపరిస్థితి. అబ్బా, బాధ! మంటలు నిస్త్రాణ!

అంతే బాబూ, ఆ రోజునుండీ మళ్ళా సైకిలు ముట్టుకుంటే చచ్చినంతఒట్టు సుమండీ. విన్నారా నా సైకిలు స్వారీగాథ?

(ఆధారం: హిందీ కథ)

క థా ని క

# బ్రతుకనేర్చిన భావనారాయణ

యం. వి. యస్. కృష్ణారావు

ఒకరోజు హఠాత్తుగా భావనారాయణ నా గదిమీదికి దాడిచేశాడు. గ్లాస్కో లాల్చీ, గ్లాస్కో పంచె, మామూలుగా భావకవులకూ కళాకారులకూ వుండే గిరజాల చుట్టూ, ఇదీ వాడి వాలకం. వస్తూనే అన్నాడు, "నిన్నో చిన్న సలహా అడుగుదామని వచ్చారా."

వాడి పని తొందరలో అప్పటిదాకా నాతో మాట్లాడుతూ నా పక్కన కుర్చీలో కూచున్న సుబ్బారావుని వాడు చూడనైనాలేదు. "నా ఒక్కడి సలహా ఏం, వాడి సలహాకూడా తీసుకో వచ్చు" అన్నాను సుబ్బారావుని వేలుతో చూపిస్తూ.

అంతవరకూ సుబ్బారావుని చూడనందుకు నొచ్చుకుని "ఇంకనే, ఈ ముఖ్యమైన విషయంలో మీ ఇద్దరి సలహా తప్పకుండా కావాలిరా" అన్నాడు.

"అసలు సంగతేమిటో త్వరగా అఘోరించు" విసుక్కుంటూ అన్నాడు సుబ్బారావు.

"ఏం లేదురా" వున్న విషయాన్ని యెలా చెప్పాలో తెలియక తటపటాయిస్తున్నాడు.

"నీ బొంద ఏమీ లేకపోవటమేమిటి! వుందని నువ్వే చెప్పితివిగా!"

"ఆగరా సుబ్బారావ్. వాణ్ణి చెప్పనివ్వు" అన్నాను. ఇంతలో భవనారాయణ అందుకున్నాడు "ఏంలేదురా, నేను సంగీతం పాడుతానని మీకు తెలుసుగా."

"ఏడిశావులే. నువ్వు తీసే కూనిరాగాలకీ సంగీతానికీ లంకె పెడతావేం?" అన్నాడు సుబ్బారావు వాణ్ణి పూర్తిగా చెప్పనివ్వకుండా.

"నీ మొహం నువ్వెప్పుడూ నేను పాడగా సరిగా విననైనాలేదు."

"నాకు సంగీతం వచ్చునో రాదో వాడికి తెలుసు" అన్నాడు నన్ను గురించి చెపుతూ.

"అయినా ఇప్పుడు నీకు సంగీతంతో అంత ప్రాణావసర మేమొచ్చింది" అన్నాను.